క్లుప్తంగా

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



నిజాంపట్నం: నిజాంపట్నం మండలం కళ్ళిఫలం పంచాయతీ కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నిజాంపట్నం ఏడుకొండలు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరు గణేష్ శనివారం ఏడుకొండలు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేసి భవిష్యత్‌లో ఏడుకొండలు కుటుంబానికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ ఏడుకొండలు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, నల్లూరి శేషగిరి, నాగేశ్వరరావు, బగ్గారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రస్ కాంపిటేషన్




రేపల్లె రూరల్: పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలు ప్రాంగణంలో శనివారం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ చదివే చిన్నారులు వివిధ వస్త్రధారణతో పలువురిని అలరించారు. రైతులు, స్పైడర్ మెన్, అల్లూరి సీతారామరాజు, సరస్వతీదేవి, పోలీసు, ఆర్మీ వంటి అనేక వేషధారణలలో చిన్నారులు చేసిన ఫ్యాషన్‌షో పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగాకుతో మంచి ఆరోగ్యం



రేపల్లె రూరల్: ఆహారంలో మునగాకును చేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని సీడీపీఓ సుచిత్ర అన్నారు. మునగాకు పండుగ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మూడోవార్డు బాపూజీ ప్రాథమిక పాఠశాలలో తల్లులు, చిన్నారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మునగాకుతో వ్యాధి నిరోధక శక్తి పెరగటంతో పాటు అనేక రకాల వ్యాధులను దూరంగా ఉంచవచ్చన్నారు. ఏ, సీ విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయని, ఐదువేల సంవత్సరాల క్రితం ఈ ఆకును మందుల తయారీలో ఉపయోగించేవారన్నారు. ఇన్ని ఉపయోగాలున్న మునగాకును ప్రతి ఒక్కరూ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో మునగ చెట్టును నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమ, భవానీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న అమ్మవారి గుడి తలుపులు



చుండూరు(వేమూరు): కనకదుర్గ అమ్మవారి దేవస్థానం తలుపులు తీసి పూజలు నిర్వహించడం జరిగిందని అర్చకుడు కాంతరావు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దసరా పండగ ముగిసిన వెంటనే అమ్మవారికి విశేషమైన పూజలు చేసి రాత్రికి కుంభం పోసి, ఎర్రనీళ్లు పోసి, గుమ్మడి కాయ బలిహార్ణం చేస్తారు. దసరా రోజు అమ్మ వారి గుడి తలుపులు మూసి వేసి తొమ్మిది రోజుల తర్వాత తలుపులు తీసి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. శనివారం గుడి తలుపులు తీసి అమ్మవారికి శాంతి స్థపన, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ అర్చకులు మామిళ్లపల్లి సుబ్రమణ్యం, కనగాల పవన్, కనగాల నిరంజన్, భక్తులు పాల్గొన్నారు.

యువత గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి

రేపల్లె రూరల్: సమ సమాజ స్థాపనకై కవికోకిల గుర్రం జాషువాను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల నిర్మూలనకు, అంటరానితనం, సమాజంలో మూఢాచారల నిర్మూలనకై జాషువా ఎంతో కృషి చేశారన్నారు. ఆయన రచనలు సమాజాన్ని మేల్కొలిపాయన్నారు. అధ్యాపకులు నరసయ్య, వి.కోటేశ్వరరావు, ఎం.రాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే... అంతే!

- ప్రమాదభరితంగా మారిన కాలువలు
- సైడ్‌వాల్స్ విరిగి ఏళ్లు గడిచినా పట్టించుకోని వైనం
- కాలువలో పడి ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు

బాపట్లటౌన్: అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల పాలిట శాపంగా మారింది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జిలు నేటికీ దర్శనం ఇస్తూనే ఉన్నాయి. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలీని పరిస్థితి కునారిల్లుతున్నాయి. బ్రిడ్జిల సంగతి దేవుడెరుగు...కనీసం బ్రిడ్జిలకు సైడ్ నిర్మించిన సైడ్‌వాల్స్ పూర్తిగా విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క అధికారి వాటిపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా నిర్వహించమని గ్రామస్తులు అనేక పర్యాయాలు వేడుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది. ఈ విషయం పై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు అనేక పర్యాయాలు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదాలకు చిరునామాగా మారిన వెదుళ్లపల్లి డ్రెయిన్

ప్రమాదాల కేరాఫ్ వెదుళ్లపల్లి బ్రిడ్జి

మండలంలోని వెదుళ్ళపల్లి – మురుకుంటపాడు మార్గమధ్యలో వెదుళ్లపల్లి డ్రైనేజీ పై నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికు సైడ్ వాల్స్‌పూర్తిగా విరిగిపోయాయి. బ్రిడ్జి కూడా ఎప్పుడు కూలుతుందో తెలీని పరిస్థితి. బ్రిడ్జికు సైడ్‌వాల్స్ లేకపోవడంతో వెదుళ్లపల్లి నుంచి మురుకుంటపాడు, కంకటపాలెం వెళ్ళే ప్రజలు, వెదుళ్లపల్లి సమీపంలోని పంటపొలాల్లోకి వెళ్లే రైతులు, పశుపోషకులు నిత్యం ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఈ కాలవలో పడి ఒకరు మృతిచెందగా, శ్రీనివాసరెడ్డికు చెందిన మూడు గేదెలు కూడా కాలువపడి మృత్యువాత పడ్డాయి. అయినప్పటికీ అప్పటినుంచి ఇప్పటివరకు అధికారులుఎలాంటి చర్యలు చేపట్టలేదు.

జిల్లెళ్లమూడి బ్రిడ్జిది అదే పరిస్థితి..

బాపట్ల నుంచి జిల్లెళ్లమూడి వెళ్ళేదారిలో నల్లమడ వాగుపై నిర్మించిన బ్రిడ్జికు సైడ్‌వాల్స్ విరిగిపోయాయి. నిత్యం ఆ రోడ్డులో బాపట్ల నుంచి పెదనందిపాడు, కాకుమాను, రేటూరు వైపుగా వెళ్ళే వాహనాలు ప్రయాణించాల్సి ఉంటుంది. బ్రిడ్జిపై ఎదురురు బస్సులు వచ్చినప్పుడు పక్కకు సైడ్ ఇవ్వాలంటే ప్రమాదవశాత్తు కాలువలో పడిపోతారామోనన్న భయంతో ప్రయాణికులు, స్థానికులు భయభ్రాంతులకు గురౌతున్నారు.

కాలుజారితే కాలువలోకే..



నరసాయపాలెం సమీపంలో ప్రమాదకరంగా కొమ్మమూరు కాలువపై ఏర్పాటుచేసిన వంతెన

మండలంలోని నరసాయపాలెం శివారులో కొమ్మమూరు కాలువలపై ఏర్పాటుచేసిన వంతెన పూర్తిగా దెబ్బతిని సగభాగానికి కూలిపోయింది. మిగిలిన భాగం కూడా ప్రమాద భరింతంగానే ఉంది. దీంతో నిత్యం బాపట్ల–చెరుకురు, నరసాయపాలెం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, రైతులు, పశుపోషకులు అదే మార్గం గుండా వెళ్లాల్సి వస్తుంది. ఎదురుగా ఎలాంటి వాహనం వచ్చినా సైడ్ ఇచ్చే అవకాశం కూడా లేదు. కనీసం పక్కనే నిలబడే ప్రదేశం కూడా లేకపోవడం నిత్యం ఆ రోడ్డులో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కనీసం ఆ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటుచేయలేదు.

అమ్మో మర్రిపూడి..



ప్రమాదాలకు నిలయంగా మారిన అప్పికట్ల–మర్రిపూడి మార్గమధ్యలోని కల్వర్టు

మండలంలోని అప్పికట్ల–మర్రిపూడి కు మార్గమధ్యలో ఉన్నటువంటి పంటకాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. కనీసం సైడ్ వాల్స్ కూడా లేకపోవడంతో నిత్యం ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు రోడ్డు బ్రిడ్జి ముందు ఎత్తు తక్కువగా ఉండటం, అక్కడే మలుపు తిరగాల్సి రావడంతో వాహన చోదకులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం వలన నిత్యం ప్రమాదాలు గురికావాల్సి వస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్వర్టుకు సైడ్‌వాల్స్ నిర్మించి మలుపు తిరిగే ప్రదేశంలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధం..



మూలపాలెం వెళ్లేదారిలో సైడ్‌వాల్స్‌లేక ప్రమాదభరితంగా ఈస్ట్‌శ్యాంప్ డ్రెయిన్

బాపట్ల నుంచి మూలపాలెం వెళ్ళే దారిలో ఈస్ట్‌శ్యాంప్‌డ్రెయిన్ పై ఉన్నటువంటి బ్రిడ్జి శిథిలావస్థకు చేరి సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కాలువ వెడల్పు తక్కువగా ఉండి చాలా లోతుగా ఉంటుంది. రోడ్డు కూడా చిన్నదిగా ఉండటం వలన ఎదురుగా వస్తున్న వహనాలను తప్పించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జికు సైడ్‌వాల్స్ లేకపోవడం వలన ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీవర్షాలకు డ్రైయిన్ పొంగిన సమయంలో బాపట్ల రైలుపేటకు చెందిన ఇద్దరు యువకులు గతంలో కాలువలోపడి కొట్టుకుపోయారు. స్థానికులు స్పందించి వాళ్ళను కాపాడారు. ఉప్పరపాలెంకు చెందిన శ్రీనివాసరావు ఎనిమిది గొర్రెలు ఒక్కసారిగా మృత్యువాత పడ్డాయి.

మేరుగ పదవీ బాధ్యత స్వీకారానికి తరలిరండి

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర మాజీ మంత్రి మేరుగ నాగార్జున సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారని పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలోని ఎంఎస్సార్ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10గంటలకు జరిగే పదవీ స్వీకార మహోత్సవానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అయ్యప్పలకు సద్ది ప్రారంభం



చెరుకుపల్లి: అయ్యప్ప భవాని దీక్షా పరులకు నిత్యం సద్ది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుళ్ళపల్లి నాగ్ యూత్ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మండలంలోని గుళ్ళపల్లి నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భవాని దీక్షా పరులకు సద్ది కార్యక్రమం గుళ్ళపల్లి నాగ్ యూత్, అనగాని యువసేన ఆధ్వర్యంలో శనివారం కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సద్ది కార్యక్రమానికి గ్రామానికి చెందిన వంగర శ్రీనివాసరావు, కోటా భార్గవ్‌లు బియ్యం వితరణ చేశారు. అయ్యప్ప దీక్షా పరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి దేవస్థానంలో శనివారం అయ్యప్ప స్వామి భక్తులు 41 రోజుల పాటు అయ్యప్ప స్వామి పూజ, మధ్యాహ్నం సద్ది ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా పమిడిముక్కల శ్రీనివాసరావు (పాలశ్రీను స్వామి), మరకా శ్రీనివాసరావు (ల్యాబ్ శ్రీను స్వామి)లు అయ్యప్ప భక్తులకు మాలధారణ చేశారు. కార్యక్రమాన్ని దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో

బాపట్లటౌన్: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయలైన సంఘటన పట్టణంలోని సినిమాహాల్ సెంటర్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని 14వ వార్డు, మాణిక్యమ్మ నగర్‌కు చెందిన జాలా ప్రశాంత్‌కుమార్ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో బాపట్ల నుంచి చీరాల వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ప్రశాంత్ కుమార్ కాలికి తీవ్రగాయమైంది. బాధితుడి ఫిర్యాదుమేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు

రేపల్లె రూరల్: పట్టణంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కరించాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 2022లో రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంగా ఏర్పడినప్పటికి నేటి వరకు ఆ శాఖకు సంబంధించి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవటం శోచనీయమన్నారు. అదేవిధంగా రేపల్లె విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో రేపల్లె రూరల్ అసిస్టెంట్ ఇంజినీర్, సబ్ ఇంజినీర్, భట్టిప్రోలు అసిస్టెంట్ ఇంజినీరు, రేపల్లె డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ నేటివరకు ఆయా పోస్టులను భర్తీ చేయకపోవటంతో ఇన్‌ఛార్జ్‌లే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఇన్‌ఛార్జ్‌లు బాధ్యతలను నిర్వహించాల్సి రావటంతో అధిక పనిభారంతో, సకాలంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను, పాలనా పరమైన సమస్యలను పరిష్కరించటంలో మానసికంగా ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పట్టణంలో ఆయా కార్యాలయాలను ఏర్పాటు చేయటంతో పాటు ఆయా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు.

మత్స్యకారుల అభివృద్ధే మత్స్యయోజన లక్ష్యం

మత్స్యశాఖ జేడీ డాక్టర్ పి.సురేష్

బాపట్లటౌన్: మత్స్యకారుల అభివృద్ధే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ధ్యేయమని మత్స్యశాఖ జేడీ డాక్టర్ పి.సురేష్ తెలిపారు. మండలంలోని అడవి పంచాయతీ పరిధిలోని మత్స్యకారులతో శనివారం మత్స్యసంపద యోజన పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ పి.సురేష్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాకు రూ.2 కోట్ల మేర నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా నిధులతో మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రధానంగా తీరప్రాంతాల్లో పడవలు నిలుపుకొనేందుకు జెట్టి, కాలువ పూడికతీత, మంచినీటి సౌకర్యం, సోలార్ లైట్లు, ఎండుచేపలు ఎండబెట్టుకునేందుకు ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన జేడీ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ బి.సైదా, బాపట్ల ఎఫ్‌డీఓ ఎం.రవీంద్ర, గ్రామ మత్స్యకార సంఘం సహాయకులు జి.మరియదాస్, సాగర మిత్రలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ డాక్టర్ పి.సురేష్

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సాంఘిక సంక్షేమ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

సాంఘిక సంక్షేమశాఖ పీడీ రాజదిబోరా

బాపట్లటౌన్: బాల్య వివాహాలతో జీవితం అంధకారంగా మారుతుందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పీడీ రాజదిబోరా తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా శనివారం సాంక్షేమ సంక్షేమశాఖ, బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజదిబోరా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం పూర్తి స్థాయిలో బాల్యవివాహాలను కట్టడిచేసేందుకు ప్రత్యేక తీర్పు వెలువరించారన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధక చట్టం అమలుకు ప్రత్యేకంగా కొందరు అధికారులను నియమించారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వే నిర్వహించి జిల్లాస్థాయిలో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. డీసీపీఓ పురుషోత్తం, రోజ్ ప్రసాద్, గేదే రాజారావు, నాగరాజు, శ్యామ్యూల్ పాల్గొన్నారు.

పల్లె నిద్రతో నేరాల నియంత్రణ

వేమూరు సీఐ ఆంజనేయులు

భట్టిప్రోలు: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశానుసారం భట్టిప్రోలు మండలం పెదలంకలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద వేమూరు సీఐ పి.ఆంజనేయులు నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలు, వివాదాలు, నేరాలు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పల్లెనిద్రతో నేరాలను నియంత్రించవచ్చునని అన్నారు. అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాలను గూర్చి సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100, 112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో రాత్రి బస చేసినట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు.

22న సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా

భట్టిప్రోలు: బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి చేతివృత్తి దారులకు రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యాలయాల వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.బాలాజీ పేర్కొన్నారు. భట్టిప్రోలు ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం బాలాజీ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ 6 వాగ్దానాలు ఇచ్చి, ఆనక అమలు చేయకుండా పేదలను, చేతి వృత్తిదారులను ఆదుకోవడంలో మొండిచెయ్యి చూపిందన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు కె.రామకోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

అమర్తలూరు(వేమూరు): పంట కోత ప్రయోగంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, ఎంపీఈఓలకు పంట కోత ప్రయోగాలపై శిక్షణను శనివారం ఇవ్వడం జరిగిందన్నారు. పంట కోత ప్రయోగాల్లో సెలెక్ట్ చేయావలసిన సర్వే నంబర్లు, రాండమ్ నెంబర్ల ఆధారంగా సర్వే నంబర్లు సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా పంట కోత నిర్వహణ రిపోర్టును ఎంటర్ చేసే విధానం గురించి శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. ఈఓలు ఐ.శ్రీకాంత్ లక్ష్మీ, ప్రసన్న పాల్గొన్నారు.

నిర్బంధ విద్య అమలెక్కడ..?



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తాం.. బాలలు బడిలోనే ఉండాలి.. వంటి నినాదాలు మాటలకే పరిమితమవుతున్నాయి.. ఇప్పటికీ కొందరు బాలలు బడి బయటే మగ్గిపోతున్నారు. శనివారం సాక్షాత్తు బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోనే ఓ బాలుడు గొర్రెలు మేపుతూ కనిపించిన దృశ్యమిది. చూసిన వారంతా నిర్బంధ విద్య అమలు ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్నారు. – బాపట్లటౌన్

‘పల్లె పండుగ’తో గ్రామాల అభివృద్ధి

వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

భట్టిప్రోలు: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా భట్టిప్రోలులోని విఠలేశ్వర నగర్ కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు శనివారం శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ బాబు మాట్లాడుతూ పనులు వెంటనే ప్రారంభించి సంక్రాంతి నాటికి రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించేలా అధికారులు, నాయకులు కృషి చేయాలని కోరారు. రాచూరులో రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి, అధికారులు, ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాలలో గ్రామ సర్పంచులు ధారా రవి కిరణ్మయి, జెడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, ఎంపీడీఓ ఎస్వీ రమణ, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి, టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, పంచాయతీ కార్యదర్శులు, కె.శ్రీనివాసరావు, వక్కలగడ్డ సురేష్‌బాబు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భట్టిప్రోలులో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

అమర్తలూరు(వేమూరు): పల్లె వెలుగు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేయనున్నామని ఎంపీడీఓ శేషామాంబ తెలిపారు. అర్తలూరు మండలంలోని మూల్పూరు, పెదపూడి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. పెదపూడి గ్రామానికి రూ.15 లక్షలు, మూల్పూరు గ్రామానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రూ.6.20 లక్షల అపరాధ రుసుము విధింపు

చుండూరు(వేమూరు): విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.చిరంజీవి తెలిపారు. చుండూరు సెక్షన్ పరిధిలోని చుండూరు, ఆలపాడు, వేటపాలెం, నరికేలపల్లి, వలివేరు, చినపరిమి, యడ్లపల్లి, మోదుకూరు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు శనివారం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో 62 మంది అధికారులు, 180 మంది సిబ్బంది, 62 బృందాలుగా ఏర్పడి 5350 సర్వీసులను తనిఖీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.80వేలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిలో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురికి రూ 14వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 148 మందికి రూ.5.26 లక్షలు అపరాధ రుసుము విధించడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం రూ.6.20 లక్షలు అపరాధ రుసుము విధించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సీహెచ్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, బి.అశోక్ కుమార్, శివశంకర్, సతీష్ కుమార్, డి.అర్జునరావు పాల్గొన్నారు.



చుండూరులో విద్యుత్ తనిఖీల అనంతరం మాట్లాడుతున్న ఆపరేషన్స్ ఏఈ చిరంజీవి